# పగటి కలలు

(బెంగాలీ కథ)

**భారతీయ జానపదం:**

**డా. దేవరాజు మహారాజు**



గోపాల్ ధర్ మేడ పక్కనే ఒక చిన్న గుడిసె వుంది. అందులో ఇద్దరు భార్యాభర్తలుండేవారు. ఇద్దరికిద్దరూ పగటి కలలు కనే వాళ్ళే. ఒకరి మీద ఒకరు అరుచుకునే వాళ్ళే. వాళ్ల జగడాలు గోపాల్ ధర్‌కు ఇబ్బందిగా తయారయ్యేవి. కాని ఏం చేస్తాడు పాపం? వాళ్లు భార్యాభర్తలు! వాళ్ల విషయాల్లో జోక్యం చేసుకోవడం అంత మంచిది కాదు కదా అని ఓపిక పడుతూ వుండేవాడు.

ఒక రోజు భర్త భార్యతో అన్నాడు "ఈ మధ్య కొన్ని డబ్బులు రావల్సి వుంది. రాగానే ఒక మంచి ఆవును కొంటాను" అని.

"అలాగైతే పాలు తీసి, పెరుగు తోడేసి, చల్ల చేయడం నా వంతే. రేపే వెళ్లి కుండలు కొంటాను అంది" భార్య. అనడమే కాదు, మరునాడు సంతకెళ్లి కుండలు కూడా తెచ్చింది.

"ఏమిటే ఇన్ని కుండలు తెచ్చావు?" అని అడిగాడు భర్త.

"ఏముంది ఒకటి పాలకు, ఒకటి చల్లకు, ఇంకొకటి వెన్నకు, మరొకటి నెయ్యికి" అని చెప్పింది.

"మరి ఇంకా ఒకటి ఎక్కువే తెచ్చావే" అని కసురుకున్నాడు.

"ఆ – అదీ... పాలు ఎక్కువైనప్పుడు కొన్ని మా చెల్లెలికి పంపిద్దామని మరోకుండ అదనంగా తెచ్చాను" అని నసిగింది భార్య సిగ్గుపడుతూ, గారాబాలు పోతూ–

"ఏమిటీ! నీ చెల్లెలికా! ఎంతకాలం నుండి నడుస్తోంది ఈ వ్యవహారం? నాకు తెలియకుండా కనీసం మాట మాత్రం గానైనా చెప్పకుండా పాలన్నీ నీ చెల్లెలింటికి చేరవేస్తున్నావన్న మాట" అని బిగ్గరగా అరిచాడు. కర్ర తీసుకుని కుండలు బద్దలు కొట్టాడు. అదే చేత్తో భార్య వీపుమోత మోగించాడు. ఆమె లబోదిబోమని అరచి గోల చేసి వీధిలోకి పరుగెత్తింది.

పక్కింట్లో వున్న గోపాల్ ధర్ వుండబట్టలేక లేచి అక్కడికి వెళ్లాడు. ఆ సమయానికి భర్త, భార్యమీద వస్తువులన్నీ విసిరి కొడుతున్నాడు. గోపాల్ ధర్ మొదటి అతణ్ణి ఆపాడు. విషయమేమిటో చెప్పమని అనునయంగా అడిగాడు. ఆ తెలివితక్కువ భర్త వున్న విషయం వున్నట్టుగా చెప్పాడు. తను ఆవును కొనబోతున్నానని... దాని పాలు తన భార్య తన చెల్లెలింటికి పంపుతోందని, అందుకే తనకు కోపం వచ్చిందని చెప్పాడు.

ఆ భర్త మూర్ఖత్వానికి గోపాల్ ధర్ లోలోన నవ్వుకున్నాడు. అతడికి బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే ఆ పక్కనే వున్న దుడ్డుకర్ర అందుకుని, అతణ్ణే చావబాదడం మొదలుపెట్టాడు. అది ఊహించని భర్త గోపాల్ ధర్‌పై తిరగబడి "ఏయ్ – నన్నెందుకు కొడుతున్నావయ్యా?" అని నిలదీశాడు.

"ఎందుకేమిటి? నా కూరగాయలన్నీ నీ ఆవు మేస్తోందయ్యా" అని అన్నాడు గోపాల్ ధర్.

"కూరగాయలా? అవెక్కడివి? నీ ఇంటి ముందు ఒక్క మొక్క కూడా లేదు కదా?" అని అడిగాడు పక్కింటాయన.

"కూరగాయల లెక్కడివంటే నా ఇంటి తోటలోవే! నా ఇంటి ముందు రకరకాల కూరగాయలు పెంచుకోవాలని ఎన్నాళ్ల నుంచో అనుకుంటున్నాను. కాని ఏదీ నీ ఆవు సాగనీయడం లేదు" విసుక్కున్నాడు గోపాల్ ధర్ కోపంగా. పైగా దుడ్డుకర్రతో మళ్లీ అతని వెంట పడ్డాడు. అప్పటికి విషయం అర్థం చేసుకున్న పక్కింటి ఆసామి తన తప్పు గ్రహించి, క్షమాపణ కోరాడు. ఎప్పుడో అయితేగియితే దానికి అనవసరంగా తన భార్యను కొట్టుకున్నానని చెంపలేసుకున్నాడు. ఇకనుండి తాము బుద్ధిగా కలిసిమెలసి వుంటామని గోపాల్ ధర్‌కు ఆ దంపతులు మాట ఇచ్చారు.

[తెనాలి రామకృష్ణుడు, బీర్బల్‌ల వలె బెంగాలి జానపద కథా సాహిత్యంలో గోపాల్ ధర్ ప్రముఖంగా కనిపిస్తూ వుంటాడు.]

### సంపాదన

"నీ వయసులో లింకన్‌గారు కష్టపడి సంపాదించేవారు. తెలుసా?" అడిగాడు తండ్రి.

"ఆ విషయం నాకు తెలియదు కాని, నీ వయస్సులో మాత్రం ఆయన అమెరికా ప్రెసిడెంట్‌గా వుండేవారు" చెప్పాడు కొడుకు. –పి.ఎస్.కుమార్

"నిన్న పర్సు చూసుకోకుండా హోటల్‌కి వెళ్ళాను. సర్వర్ భలే వెరైటీగా బిల్ ఇచ్చాడనుకో..."

"ఎలా యిచ్చాడేంటి?"

"బిల్‌లో రుబ్బాల్సింది ఐదు కిలోల బియ్యం, రెండు కిలోల మినపప్పు అని రాసిచ్చాడులే..."

–భమిడిపాటి చైతన్య

## అవమానం!



సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి తిరిగివచ్చిన రామారావు రాధతో "జీవితంలో ఎప్పుడూ జరగని అవమానం నాకు ఇవాళ జరిగింది" అన్నాడు.

"ఏమిటి, ఆఫీసరు అనవసరంగా మీ మీద విరుచుకుపడ్డాడా" అడిగింది రాధ.

"ఊహూ"

"మరి"

"ప్రతిరోజూ నేను సిటీబస్‌లోనే ఆఫీస్‌కి వెళ్ళివస్తూ వుంటాను గదా" చెప్పటం మొదలుపెట్టాడు రామారావు.

"ఔను" అంది రాధ.

"మన ఇంటి దగ్గర స్టాప్ నుంచి మా ఆఫీస్‌కి ఒకటే స్టేజి గదా" అన్నాడు రామారావు.

"ఔను" అంది రాధ.

"టికెట్ లిమిటెడ్ స్టాప్ బస్‌లో తొంభై అయిదు పైసలనీ, ఆ బస్‌లోనే నేను వెళ్ళివస్తాననీ నీకు తెలుసు గదా" అడిగాడు రామారావు.

"తెలుసు" అంది రాధ.

"నేను ఆఫీసుకు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు బస్‌లో కండక్టర్‌కి రూపాయి యిస్తాను. ఇవాళా వచ్చేటప్పుడు అలాగే ఇచ్చాను" చెప్పాడు రామారావు.

"డబ్బు తీసుకుని టికెట్ యివ్వక, డబ్బు ఇవ్వలేదని కండక్టర్ అన్నాడా" అడిగింది రాధ.

"టికెట్ ఇచ్చాడు. అదేం కాదు"

"స్టాప్‌లో దిగిన వెంటనే చెకింగ్ ఇన్‌స్పెక్టర్ అడిగితే టికెట్ పారేసుకోవడం వలన అందరి ముందరా ఫైన్ కట్టవల్సి వచ్చిందా" రాధ సహనం కోల్పోతూ అడిగింది.

"కాదు" అన్నాడు రామారావు.

"మరి"

"రూపాయి తీసుకుని టికెట్ ఇచ్చిన కండక్టర్, టికెట్‌తో అయిదు పైసలు ఇచ్చాడు" అని అసలు విషయం చెప్పాడు రామారావు!

– తాజీప్రసాదు

10-2-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక